Andhra Jyoti
26-06-2015



# 41 లక్షల గ్యాస్ కనెక్షన్లు

- రెండేళ్లలో రాష్ట్రానికి కేటాయింపు
- 20 లక్షల పైప్‌లైన్ కనెక్షన్లకు కేంద్రం ఓకే
- 27 నుంచి గెయిల్ గ్యాస్ సరఫరా ప్రారంభం
- ఏపీలో సోలార్ ప్యానల్స్ తయారీ కేంద్రం
- మాధవరంలో పెట్రో వర్సిటీ
- వచ్చే ఏడాది నుంచే ప్రారంభం
- పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు రూపకల్పన
- గ్యాస్, చమురు వెలికితీతపై ఏపీకి రాయల్టీ: చంద్రబాబు




కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం, జూన్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరికీ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు ఇంకా 41 లక్షల కనెక్షన్లు అవసరమని, వాటిని కేటాయించాల్సిందిగా కేంద్రాన్ని కోరామని, వచ్చే రెండేళ్లలో అవి వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల పైప్‌లైన్ వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని చెప్పారు. ఈ నెల 27 నుంచి గెయిల్ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలోని సహజ వనరులపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి గురువారం విశాఖపట్నంలో ఆయన నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు గ్యాస్ పైపులైను నిర్మాణం జరుగుతోందని, విజయవాడ నుంచి నెల్లూరుకు మరో పైపులైను నిర్మాణంలో ఉందని వివరించారు. కాకినాడలో ఎల్ఎన్‌జీ టెర్మినల్ నిర్మాణంలో ఉందని, అది పూర్తికాగానే గంగవరం పోర్టులో మరో టెర్మినల్ నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. కేజీ బేసిన్‌లో 20 నుంచి 25 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయని, ఓఎన్‌జీసీ 2018 నాటికి గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందని, ఆ మరుసటి ఏడాది అంటే 2019 నుంచి ఆయిల్‌ను కూడా వెలికి తీస్తుందని చంద్రబాబు వెల్లడించారు. వీటిపై ఏపీకి రాయల్టీ వస్తుందన్నారు. "ఏపీలో ఆయిల్ రిఫైనరీ గానీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ గానీ పెట్టాలనే యోచన ఉంది. రిఫైనరీ కంటే పెట్రో కాంప్లెక్సే ఉపయోగకరంగా ఉంటుందని ధర్మేంద్ర ప్రధాన్ సూచించారు. దీనిపై ఓ కమిటీ వేసి అధ్యయనం చేయిస్తామన్నారు. "స్థానిక ఇంధన వనరులపై పరిశోధనలకు పెట్రోలియం యూనివర్సిటీ అవసరం. దానికి తూర్పు గోదావరి జిల్లాలో పిఠాపురం దగ్గర మాధవరం అనుకూలంగా ఉంటుందని కేంద్రానికి సూచించాం. వీలైతే వచ్చే ఏడాది (2015-16) నుంచే అది పనిచేసే అవకాశం ఉంది" అని చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో దేశానికి చమురు, గ్యాస్ హబ్ (సహజ ఇంధన వనరుల కేంద్రం)గా మారనుందని చెప్పారు. ల్యాండ్ ఆఫ్ లా ప్రకారం సముద్ర భూగర్భం నుంచి వెలికితీసే ఇంధన వనరులపై రాయల్టీని పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నామని, ఈ విషయంలో 19వ స్టాండింగ్ కమిటీ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పామని వివరించారు. ఈ ప్రతిపాదనను ప్రధాని దగ్గర పెట్టడానికి పెట్రోలియం మంత్రి అంగీకరించారన్నారు. సామాజిక బాధ్యత కింద ఆయిల్ కంపెనీలు ఖర్చు చేసే మొత్తంలో అధిక వాటా ఏపీకి కేటాయించాలని కోరగా దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి విశాఖపట్నం వచ్చి సహజ వాయువు, ఇంధన వ్యవహారాలపై సమీక్షించి, కార్యాచరణ రూపొందించి అమలు చేయడానికి కూడా అంగీకరించారని వెల్లడించారు. బయో డీజిల్ ఉత్పత్తికి అవకాశాలను పరిశీలిస్తున్నామని, దీనిపై పరిశోధనలకు ఏపీని మోడల్‌గా తీసుకోవాలని కోరామని చెప్పారు.

### పీసీపీఐఆర్‌లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు

ఏపీలో ఏర్పాటు చేసే పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌లో ప్రాథమికంగా రూ.30 వేల నుంచి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు చెప్పారు. విశాఖలో హెచ్‌పీసీఎల్ విస్తరణకు వెళుతోందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అయినా, కాలుష్యం పెరగకుండా చూడాలని కోరామని తెలిపారు. ఇంధన పొదుపులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచినందుకు ప్రధాని మోదీ ప్రశంసించారని చెప్పారు. ఏపీలో 2000 మెగావాట్ల సోలార్, 1000 మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అలాగే, సోలార్ ప్యానల్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

### నాణ్యతగా పుష్కర పనులు: సీఎం

రాజమండ్రి: "గోదావరి పుష్కరాలు అద్భుతంగా జరగాలి. యాత్రికులకు ఆహ్లాదం కలిగించాలి. పనుల్లో నాణ్యతా లోపాలను సహించను. బాగా చేసిన వాళ్లను అభినందిస్తాను. తప్పులు చేసిన వాళ్లపై చర్య తీసుకుంటాను. ఒక్క ఫిర్యాదు వచ్చినా చర్య తప్పదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఉభయ గోదావరి జిల్లాల గోదావరి తీరంలో జరుగుతున్న పుష్కర పనులపై గురువారం ఆయన ఏరియల్ సర్వే చేశారు. రేవుల్లో పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం రాజమండ్రిలో అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో పుష్కర పనులు, ఏర్పాట్లపై సమీక్షించారు. ఇప్పటి వరకు 63 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, నెలాఖరుకి అన్నీ పూర్తి కావాలని, నూరు శాతం నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు.

File

26/6/15